క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ హెల్ప్ డెస్క్ అటెండెంట్, కుట్టు మిషన్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ కోర్సులకు నగరి నియోజకవర్గ పరిధిలోని యువతీ యువకులు ఈనెల 25వ తేదీ లోపు కళాశాలలోని స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన వారికి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 63009 54441ను సంప్రదించాలని కోరారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

నగరి : దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నగరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పీసీసీ జనరల్ సెక్రటరీ ఆర్ బాబు ఆధ్వర్యంలో నాయకులు స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాకో దారి చూపండి


రోడ్డుపై బైఠాయించిన రైతులు

నిండ్ర: మండలంలోని అత్తూరు గ్రామ రైతుల సమస్యను పరిష్కరించాలని స్థానిక రైతులు ధర్నా మంగళవారం చేశారు. నూతనంగా బైపాస్ రోడ్డుకు ప్రహరీ నిర్మించడం వలన రైతులకు పంట పొలాలకు వెళ్లే దారి లేక ఇబ్బందికరంగా ఉందని రోడ్డుపై రైతులు బైఠాయించారు. వారు మాట్లాడుతూ రైతులకు పొలాలకు వెళ్లడానికి దారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ప్రహరీ నిర్మించడం వలన రోడ్డు నుంచి పొలాలకు వెళ్లలేకపోతున్నామని చెప్పారు. రోడ్డు నిర్మాణం సమయంలో రైతులకు దారి కల్పిస్తామని చెప్పిన రోడ్డు నిర్వాహకులు నేడు దారి లేదని చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అత్తూరు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు గుర్తించండి


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

విజయపురం : మండలంలో ఈ నెల 23న అన్ని పంచాయతీల్లో గ్రామ సభ ఏర్పాటు చేసి, ఉపాధి హామీ పథకం ద్వారా జరగాల్సిన పనులను గుర్తించాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం గ్రామ సభపై పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ కింద జరగవల్సిన పనులపై ప్రజల తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని చెప్పారు.

ఎస్ఐ జయప్పకు బదిలీ వీడ్కోలు


ఎస్ఐ జయప్పను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐలు, సిబ్బంది

విజయపురం : ఎన్నికల వేళ ఎస్ఐ జయప్ప సేవలు మరవలేనివని నగరి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. ఎస్ఐ జయప్ప నందలూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నిండ్ర సీఐ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జయప్పకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. నగరి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ మహేష్, పోలీసులు సిబ్బంది దుశ్శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నగరి సీఐ మహేష్, నిండ్ర సీఐ రామసుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చెంగయ్య, సిబ్బంది జనార్దన్, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీకి సన్మానం


ఈవోపీఆర్‌డీని సన్మానిస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులు

విజయపురం : మండలంలో నూతనంగా ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్‌ను గ్రీన్ అంబాసిడర్ కార్మికులు మంగళవారం సన్మానించారు. దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ప్రజాప్రతినిధులు, సిబ్బంది అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవలందిస్తానని చెప్పారు.

పాలసముద్రం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో దోమల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు



దోమ కాటు - ఆరోగ్యానికి చేటు

శ్రీరంగరాజపురం : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని దోమల నివారణకు కృషి చేయాలని మండల వైద్యాధికారులు బాలసుబ్రమణ్యంరెడ్డి, గిరి, గౌరి పిలుపునిచ్చారు. దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట, ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి పురవీధుల్లో ర్యాలీ చేశారు. అనంతరం విద్యార్థులతో దోమల నివారణకు ప్రతిజ్ఞ చేయించారు.

పాలసముద్రం : దోమకాటు వల్లే మలేరియా సోకుతుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది దోమకాటు వల్ల వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు. మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

విజయపురం : ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి సోమశేఖర్ సూచించారు. దోమల నివారణ దినోత్సవంలో భాగంగా ప్లకార్డులు చేతపట్టి పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వెదురుకుప్పం: దోమల నివారించాలని వైద్యాధికారి సురేఖ అన్నారు. పచ్చికాపల్లంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.


విజయపురం : ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



శ్రీరంగరాజపురం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి

అనధికార లేఅవుట్లపై చర్యలు

నగరి : మున్సిపల్ పరిధిలోని అనధికార లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, అలాంటి లేఅవుట్లకు భవన నిర్మాణ అనుమతులు, రోడ్లు, కరెంటు, నీరు డ్రైనేజీ సదుపాయాలు ఇచ్చేది లేదని చెప్పారు. మున్సిపల్ పరిధిలో సదయప్ప నగర్ ఎక్స్‌టెన్షన్, బంగారు కన్నియప్ప నగర్, విజికెఎస్ లేఔట్, ఎఎంఎల్‌సి బ్రదర్ లేఔట్, విజిఎస్ నగర్, మారుతి నగర్ లేఔట్, శ్రీ నగర్ లేఔట్, అయ్యప్ప నగర్ లేఔట్, శ్రీ క్రిష్ణా నగర్ లేఔట్, కాకవేడులో సర్వే నెంబర్ 191/1,2,4,197/1,2,3,4లోను, 199/4లోను ఏర్పాటుచేసిన లేఅవుట్లు, టీఆర్ కండ్రిగ సర్వే నెంబర్ 207/3లోని లే అవుట్, ఎస్ఆర్ఎస్ అగ్రహారంలో సర్వే నెంబర్ 242/7, 264/3లలోని లేఅవుట్, తెరణిల సర్వే నెంబర్ 220/7ఎ,7బి, 220/7సిలో వేసిన లేఅవుట్, అన్నామలై నగర్ ఎక్స్‌టెన్షన్, నందాలియమ్మన్ నగర్, అన్నామలై నగర్, లక్ష్మీనగర్, సంజీవ్ నగర్, విజెవిఎం నగర్ సర్వే నెంబర్ 191/2సి, గరుడాద్రినగర్, నెత్తం కండ్రిగ సర్వే నెంబరు 167/2లోని లేఅవుట్, ఎస్ఎంటీ నగర్ లేఅవుట్, పద్మావతినగర్ లేఅవుట్, ఏకేఎన్ ఎక్స్‌టెన్షన్ లేఅవుట్, కృష్ణానగర్, నగరిలో సర్వే నెంబరు 143, 37, 92, 91, 274లో వేసిన లేఅవుట్లను అనధికార లేఅవుట్లుగా గుర్తించామన్నారు. ఈ లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. అవి రిజిస్ట్రేషన్ చేయడం కుదరదన్నారు. ఈ లే అవుట్లు వేసిన యజమానులు, డెవలపర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం : మండల పరిధిలో రెవెన్యూ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, రైతు భరోసా కేంద్ర సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అక్రమంగా ప్రభుత్వ భూమి ఆక్రమించకుండా చూడాలన్నారు. రైతుల నుంచి రెవెన్యూ సమస్యలు వస్తే వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. రైతులు సాగు చేసిన పలు పంటలను ఆర్బీకే సిబ్బంది నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా రేషన్ కార్డుదారులకు అందించాల్సిన బాధ్యత సంబంధిత వీఆర్‌ఓలపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మదుబాబు, రెవెన్యూ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ

గంగాధర నెల్లూరు: చెత్త నుంచి సంపద సృష్టించే విధానం గురించి సిబ్బందికి మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్ర రాజు రెండవ రోజు పునఃశ్చరణ శిక్షణ కార్యక్రమంలో తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో చెత్త సేకరణకు సంబంధించి తడి, పొడి చెత్తకు వేర్వేరు భాగాలను, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర పొడి చెత్తకు సంబంధించి చెత్త సేకరణ సమయంలోనే వేరు చేసుకోవాలని, అలాగే బట్టుకండిగ పెద్ద కాల్వ గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి చేర్చి గ్రామపంచాయతీలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసే విధానం ? వర్మీ కంపోస్టు తయారీ పద్ధతులను తెలియజేశారు. ఈ కార్యక్రమం ఎస్ఐఆర్‌డీ అబ్జర్వర్ ప్రసాద్ సందర్శించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25లో చేసిన తప్పులను ఎలా సవరించాలి ? అలాగే 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాఘవేంద్ర రాజు, శిక్షకులు శ్రీనివాసులు, శివయ్య, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేర్వేరుగా సేకరించాలి

విజయపురం: ప్రతి రోజూ గ్రామాల్లో తడి, పొడి చెత్తలను సేకరించాలని ఈవోపీఆర్‌డీ సురేంద్ర కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రీన్ అంబాసిడర్ కార్మికుల సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను త్వరగా విడుదల చేయాలని కోరారు. రానున్న రోజుల్లో ప్రతి నెలా జీతం సక్రమంగా అందించాలని డిమాండ్ చేశారు. జీతాలు లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. దీనిపై స్పందించిన ఈవోపీఆర్‌డీ పెండింగ్‌లో ఉన్న జీతంతో పాటు, రానున్న నెలల్లో జీతాలు సక్రమంగా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పొడి, తడి చెత్తలను తొలగించి, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఆదేశించారు.


గ్రీన్ అంబాసిడర్ కార్మికులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ


సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ప్రసాద్

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: స్థానిక ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన వారు ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసుకోవాలని, 29న శాంతిపురం ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

పాడిరైతుల అభివృద్ధికి శ్రీజ కృషి

గుడిపాల: శ్రీజ డెయిరీ ద్వారానే పాడి రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో మంగళవారం పాడి రైతులకు వసంతాపురంలో స్టీల్ పాలక్యాన్లు, మొక్కజొన్నలు, పాడి ఆవులకు మినరల్ మిక్చర్, టానిక్‌లను ఆయన అందజేశారు.

గాలికుంటు నివారణకు టీకా

- 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు గాలికుంటు వ్యాధికి ఉచితంగా టీకాలు
- పశువుల సంరక్షణపై పశువైద్యశాఖ ప్రత్యేక దృష్టి

బంగారుపాళెం: పశువుల్లో అనేక వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో నివారణకు పశువైద్యశాఖ ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసింది. వైరస్ వల్ల వచ్చే తీవ్రమైన అంటువ్యాధి ఈ గాలికుంటు వ్యాధి. చీలిన గిట్టలున్న పశువుల్లో మాత్రమే ఈ వ్యాధి కనిపిస్తుంది. గాలికుంటు వ్యాధి కలిగించే వైరస్‌లో ఓఏసీ, ఆసియా–1, సాట్–1, సాట్–2, సాట్–3 వంటి రకాలున్నాయి. వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుంది. దేశవాళీ పశువుల కంటే సంకరజాతి పశువుల్లో ఎక్కువ నష్టం కలగజేస్తుంది. గాలి కుంటు వ్యాధి బారిన పడిన పాడిపశువు పాలు తాగితే దూడలు మృత్యువాత పడతాయి. పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. 20 నుంచి సెప్టెంబరు 18 వరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద గ్రామాల్లో ఉన్న ప్రతి పశువుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోంది.

గాలికుంటువ్యాధిపై అప్రమత్తం

గాలికుంటువ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి మందులను వాడాల్సి ఉంటుంది


పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి


పశువులకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేడీ ప్రభాకర్

వ్యాధివ్యాప్తి

ఈ వ్యాధి కలిగించే వైరస్ క్రిములు పశువుల పేడ, పారుడు, పొంగు, వీర్యము, పాలు, పుండ్ల ద్వారా విసర్జింపబడి వేరొక పశువు నీటిద్వారా, గాలి ద్వారా, మేతద్వారా వ్యాప్తి చెందుతాయి.

టీకాలు వేయించాలి



పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో పాడిరైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. పశువులకు ఈ వ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతోంది. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. వ్యాధి రాకుండా ముందస్తుగా ఎంతో ఉపయోగపడుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఆసిఫ్, అసిస్టెంట్ డైరెక్టర్, బంగారుపాళెం

వ్యాధి లక్షణాలు

- ఇంకుబేషన్ కాలం 2 నుంచి 6 రోజులు వ్యాధికి గురయ్యే శాతం ఒకటి నుంచి రెండు శాతం ఉంటుంది.
- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు ఫారన్‌హీట్ ఉంటుంది.
- పశువు మేతమేయదు, నెమరువేయదు, నోటి లో బొబ్బలు పగిలి చొంగ కారుతుంటుంది.
- కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి పశువులు కుంటుతూ నడుస్తాయి.
- పనిచేసే పశువుల్లో శక్తి నశిస్తుంది.
- పాలిచ్చే పశువుల రొమ్ములపైన, పొదుగులపైన బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు వస్తుంది.
- పాడిపశువులలో గర్భధారణ శక్తి కోల్పోతాయి.
- మేకలు, గొర్రెలు, పందుల్లోనూ గాలికుంటువ్యాధి వస్తుంది.

నివారణ చర్యలు

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.
- 5 శాతం క్రెసాల్‌ను నీటిలో కలిపి పశువుల పాకను కడిగితే వైరస్ నశిస్తుంది
- పక్క గ్రామాల్లో వ్యాధి ఉన్నప్పుడు పశువులను సంతలకు, జాతరలకు వెళ్లనివ్వరాదు
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా మొదటి సారి 2 నెలల వయసులోనే వేయించాలి. బూస్టర్ డోసు నెల తరువాత వేయించాలి. ఆ తరువాత ప్రతి ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.
- టీకా మందు మోతాదు 2 ఎంఎల్ ఇవ్వాలి.
- టీకా వేసిన తరువాత 1 నుంచి 3 వారాల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొంది పశువులలో వ్యాధి సోకకుండా ఉంటుంది.
- పాడి పశువులకు ఈనిన తరువాత టీకా వేయించాలి.
- కలుషితమైన పశువుల దాణా, మేతలను కాల్చివేయాలి.
- వ్యాధి సోకిన ఆంబోతులు, దున్నలను సంపర్గానికి వినియోగించరాదు.
- పాలను బాగా వేడి చేసిన తరువాత తాగడానికి వినియోగించాలి.
- వ్యాధితో బాధపడుతున్న పశువుల పాలను తాగిన దూడలు చనిపోయే ప్రమాదం ఉంది.
- బశువుల కళేబరాన్ని లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతిపెట్టాలి. లేదా కాల్చివేయాలి.

విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం దళితవాడ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జి.ప్రతాప్ ఉచితంగా నోటు పుస్తకాలు అందించారు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన ఆయన 97 మంది పిల్లలకు ఉచితంగా నోటుపుస్తకాలు అందించారు. దాతకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

కార్వేటినగరం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అసంబద్ధమని సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయాలన్న జాతీయ నాయకుల పిలుపు మేరకు నేడు బుధవారం చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు నాయకుడు చలపతిరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల అన్ని విధాలా మాలలు నష్టపోతారని, రానున్న తరాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో భంగం కలిగించే వర్గీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్నదమ్ముల్లా కలసిమెలసి ఉంటున్న మాల, మాదిగల మధ్య వర్గీకరణ పేరుతో చిచ్చులు పెడుతున్నారని, ఇది సరికాదన్నారు. నేటి భారత్ బంద్‌లో యువకులు, మహిళలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సోదరులు, వివిధ రాజకీయ నాయకులు, దళిత సోదరులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ఎం.దొరబాబు, కిరణ్‌కుమార్, ఏకాంబరం, సుందర్‌రాజ్, చరణ్, ప్రవీణ్, నరేష్, వెంకటేష్, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.


నోటు పుస్తకాలతో విద్యార్థులు